సాగు లెక్క..ఇక పక్కా

- రైతువారీగా సాగు వివరాలు నమోదు
- నియంత్రిత సాగు నేపథ్యంలో సేకరణ
- ఆన్‌లైన్‌లో నమోదు

మండలవ్యాప్తంగా..

పంటలు	ఎకరాలు
పత్తి	80,000
వరి	14,410
మొక్కజొన్న	6,000
సోయా	1,200
పసుపు	968
కందులు	945
పెసర	25
మినుములు	30



మొక్కజొన్న పంట సర్వే నిర్వహిస్తున్న ఏఈవో

లోకేశ్వరం: రైతులకు గిట్టుబాటు ధర అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పంటల సర్వే చేపడుతోంది. వ్యవసాయంలో దిగుబడి పెరిగేలా నియంత్రిత సాగు విధానాన్ని అమల్లోకి తెచ్చింది. సాగు లెక్కా పక్కగా అమలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించింది. రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

మండలంలో..

మండలంలోని 12,100 మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో 26 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వరి, పత్తి, పెసర, కంది సాగు చేసేలా వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. దాని ఆధారంగా విత్తనాలు, ఎరువులను అందుబాటు ఉండేలా చర్యలు చేపట్టింది. నియంత్రిత సాగు నేపథ్యంలో వరి సన్నరకాలకు అధిక ప్రాధాన్యం కల్పించింది. ఇందులో మొక్కజొన్నను చేర్చలేదు. మండలంలో అక్కడక్కడ మొక్కజొన్న సాగవుతోంది. దీని స్థానంలో కంది, సోయా పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

రైతు యూనిట్‌గా..

రైతులను ఒక యూనిట్‌గా తీసుకుని పంటల సర్వేను వ్యవసాయ శాఖ జిల్లాలో చేపడుతున్నారు. ఈ ప్రక్రియను ఏఈవోలు చేపట్టనున్నారు. వ్యవసాయ భూముల సర్వే నంబర్ల ఆధారంగా రైతులు సాగు చేసిన పంటలను గుర్తిసారు. ఈ వివరాలను వెంటనే ఏఈవోలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత సంబంధిత రైతులు ఉత్పత్తులను అమ్మునేందుకు మార్కెట్‌కు వెళ్లినప్పుడు మద్దతు ధర కల్పించి కొనుగోళ్లు చేయనున్నారు.

సర్వే నంబర్ల ఆధారంగా



రైతుల పట్టా పాస్‌పుస్తకాలు, సర్వే నంబర్ ఆధారంగా పంటల సాగుపై సర్వే ప్రక్రియ చేపట్టాం. సాగు వివరాలను ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో రైతులకు మద్దతు ధర లభిస్తుంది.

– గణేశ్, ఏవో

చినుకుపడితే చిత్తడే



కుంటాలలో గజ్జలమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు దుస్థితి

కుంటాల: చినుకుపడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పాఠశాలలు, బస్టాండ్, ఆలయాలకు వెళ్లేదారులు రోడ్ల ఆనవాళ్లు కోల్పోయి దర్శనమిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



12వ వార్డులో చిత్తడిగా మారిన రోడ్డు

'ఎమ్మెల్యేపై దుష్ప్రచారం సరికాదు'

ఖానాపూర్: ఎస్సీ సామాజికవర్గానికి రిజర్వ్ అయిన ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక విషయంలో స్థానిక ఎమ్మెల్యేపై కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసేవారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే సూచనమేరకే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆశావహులు మార్కెట్ చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అందరితో చర్చించాకే ఆమోదయోగ్య విధంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఎమ్మెల్యే ప్రకటించారని తెలిపారు. ఖానాపూర్‌కు చెందిన పార్టీ సీనియర్లకే ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్, అశోక్, శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పదవి కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బంజారా జేఏసీ నాయకులు

కడెం: బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట బంజారా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నారు. సోమవారం నాటికి మూడో రోజు చేరింది. రాష్ట్రమంత్రి వర్గంలో బంజారాలకు చోటు దక్కితే గిరిజన గ్రామాలు, తండాలు అభివృద్ధికి నోచుకుంటాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణావత్ సిద్దార్థనాయక్ తెలిపారు.

వర్షాలకు కూలిన ఇల్లు



ఖానాపూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన వడ్ల చిన్నమ్మ ఇల్లు సోమవారం కూలింది. ఆ సమయంలో ఆరు బయట ఉండడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తనకు నుంచి పరిహారం అందించాలని చిన్నమ్మ కోరింది.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

దస్తురాబాద్: పంచాయతీ కార్మికుల సమస్యల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ విధానం రద్దుతోపాటు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నేడు చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పంచాయతీ కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. యూనియన్ నాయకులు నర్సయ్య, లింగన్న, శ్రీనివాస్, రాజలింగం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి ల్యాప్‌టాప్, ఫోన్ అందిస్తున్న సభ్యులు

తానూరు: మండలంలోని ఝరి(బి)తండాకు చెందిన జాదవ్ ధన్‌రాజ్ ఇటీవల విడుదలైన ఎన్‌ఐటీ ఫలితాల్లో స్టేట్ 2218 ర్యాంక్ సాధించాడు. బిహార్‌లోని పాట్నా ఇంజినీరింగ్ కళాశాలకు ఎంపికయ్యాడు. పేదరికం కారణంగా వెళ్లలేని పరిస్థితి ఉందని, ఆర్థిక సాయం అందించాలని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ చైర్మన్ కదారి నరేశ్, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ స్పందించారు. సోమవారం హైదరాబాద్‌లో విద్యార్థికి ల్యాప్‌టాప్‌తోపాటు ఫోన్‌ను అందించారు.

సన్మానం



గంగాధర్‌ను సన్మానిస్తున్న మిత్రులు

కుభీర్: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు టి.గంగాధర్ ఇటీవల గ్రేడ్ వన్ పండిత్‌గా పదోన్నతి వచ్చింది. చిన్ననాటి మిత్రులు సోమవారం ఆయన్ను సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు బోడిగాం గంగాశేఖర్, వెంకటస్వామి, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

'టీచర్ సస్పెన్షన్ హేయమైన చర్య'

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థుల సత్ప్రవర్తన కోసం పాటుపడుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన ప్రభుత్వ టీచర్ శిరీషని సస్పెండ్ చేయడం హేయమైన చర్యని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయన్న, హరిప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఆర్టీయూ జిల్లా పక్షాన ఆమెకు మద్దతు తెలిపారు.

తపాలా పొదుపుతో ప్రయోజనం



సారంగాపూర్‌లో సుకన్య యోజన పొదుపు పథకం ఖాతాను అందిస్తున్న ఇన్‌స్పెక్టర్

సారంగపూర్: తపాలా శాఖలో పొదుపు పథకాలు ప్రయోజనం ఉంటుందని భైంసా సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంతోపాటు అడెల్లి గ్రామంలో తపాలా సేవలపై, పొదుపు పథకాలు, తదితర అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ప్రతీ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ) పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకులోని ఏఈపీఎస్, జీఏజీ, పాలసీలు, డీఎల్‌సీసీ(డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) గురించి వివరించారు. పొదుపు, బీమా పథకాలు తక్కువ ప్రీమియంతో అధిక లాభాలు ఉంటాయన్నారు. వివిధ పొదుపు పథకాలకు సంబంధించి 350 వరకు ఖాతాలు, పొదుపు పాలసీలు చేశారు. భైంసా సబ్‌డివిజన్ మేల్‌ఓవర్సీర్ నరేశ్, పవన్, బీపీఎంలు రాజేష్, మహేందర్, సుధాకర్, శ్యామ్‌సుందర్, అఖిల, వనిత, వరప్రసాద్, అబ్బాస్, ప్రవీన్, ఏబీపీఎంలు అజార్, శృతి, సాయికిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సోన్: పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, తదితరులు

సోన్: మండలంలోని జాఫ్రపూర్ గ్రామానికి చెందిన ఆత్మ మాజీ చైర్మన్ నర్సారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, నిర్మల్ మాజీ ఎంపీపీ వి.సత్యనారాయణగౌడ్ సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచులు మోహినొద్దీన్, ఎల్చల గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, సాయారెడ్డి, అంబేకర్ ప్రసాద్, ముత్యం, రాజు, మాజీ మండల అధ్యక్షుడు సరికెల గంగన్న, బీజేపీ నాయకులు రాజనర్సయ్య, బీజీ రెడ్డి, హరీశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సారంగపూర్‌లో..

సారంగపూర్: మండల కేంద్రానికి చెందిన కందూరి నర్సయ్య, స్వర్ణ గ్రామంలో ఒల్లెపు రాజు, బీరవెల్లిలో సగ్గం భూమన్న ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాలను మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. కొట్ల(బి) గ్రామంలో అనారోగ్యం బారినపడి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త చౌహాన్ భీమ్‌రావు పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.5 వేలు అందించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, అబ్దుల్ హాదీ, ఉట్ల రాజేశ్వర్, సురేందర్ ఉన్నారు.

నిరుపేదలకు వరంలాంటిది



చెక్కులు అందజేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంలాంటిదని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 47 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను డీసీసీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. పీసీసీ సభ్యులు సాద సుదర్శన్, మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాల్, మధుకర్ రెడ్డి, రాంరెడ్డి, వాజీద్ ఖాన్, కౌన్సిలర్లు మతీన్, వేణు, బాపయ్య, వికాస్‌రెడ్డి, రఫీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే



8వ వార్డులో సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ జ్వరాలపై సర్వే చేపట్టారు. ఎలాంటి జ్వరం వచ్చినా స్థానిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లాలని సూచించారు. వైద్యాధికారి శ్యాంకుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతోపాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం పుష్ప, ఆశాకార్యకర్తలు జె.శోభ, లక్ష్మి, సీహెచ్‌వో రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీటీమ్‌లు

దస్తురాబాద్: మహిళల రక్షణ కోసమే షీటీమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాల విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో షీటీమ్ సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఇన్‌చార్జి ఎస్సై శంకర్, సిబ్బంది దైవకార్, సురేందర్, శ్రావణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి



కుంటాల: రికార్డులను పరిశీలిస్తున్న సీఐ నైలు

కుంటాల: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలగాలని భైంసా రూరల్ సీఐ నైలు పేర్కొన్నారు. కుంటాల పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరగకుండా గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చాలన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని అన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాత్రిసమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సై వి.రజినీకాంత్, ఏఎస్సై దేవ్‌రావు, సిబ్బంది రంజిత్ కుమార్, శంకర్, సవిత, రతన్ ఉన్నారు.

ప్రజలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలి

కడెం: పోలీసులు ప్రజలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్, డయల్ 100 ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. అనంతరం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండాలి

సోన్: ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదగా ఉండాలని సీఐ కె.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈనెలలో జరిగిన నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఇందులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలోని సమస్యలపై సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ప్రస్తావించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఖాళీల భర్తీ చేపట్టాలని, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. భైంసా ఏరియాస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీతోపాటు సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించాలన్నారు. కుభీర్‌లో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతోపాటు లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అప్పగించాలని కోరారు. భైంసా డిపోలో ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచి ప్రతీ గ్రామానికి బస్సు నడపాలని అసెంబ్లీలో మాట్లాడారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భైంసాటౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన భైంసా మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా గ్యారంటీలను అమలు చేయకపోవడం, రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధన, తదితర వైఫల్యాలు వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా, మండలాధ్యక్షుడు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

భైంసాటౌన్: ఉపాధ్యాయుల హక్కుల సాధన, సంక్షేమం పీఆర్టీయూ తెలంగాణతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రాథమిక సభ్యుల సమావేశంలో కుభీర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురంశెట్టి సాయికుమార్(పల్సి), ప్రధాన కార్యదర్శిగా బాగుల చంద్రశేఖర్(సోనారి), ఉపాధ్యక్షులుగా దాసరి సాయన్న(కుభీర్), అసోసియేట్ అధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి(పల్సి), కార్యదర్శిగా అరుణ్‌నాయక్(పార్డి-బి), కోశాధికారిగా చందాల ఎర్రన్న(పల్సి), నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా హరిహరనాథ్ (కుభీర్)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చక్రాల హరిప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సొప్పర్‌వార్ శంకర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు సరికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ వెంకటేశ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సుర్జాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించాలని కోరారు.

గోరింటాకు సంబురాలు



ఖానాపూర్: అషాడమాసం పురస్కరించుకొని పట్టణంలోని టవర్స్ కాలనీలో ఎల్లాపి సంఘం ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం గౌరి అమ్మవారికి పూజలు చేశారు. ఉమారాణి, బోనగిరి సుజాత, జ్యోతి, లలిత, వీణారాణి, భాగ్య, స్వప్న, అరుణ పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

భైంసాటౌన్: దళితులపై దాడులు అరికట్టాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో దళితులపై దాడులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని దళిత సంఘాల నాయకులు, వివిధ గ్రామాల దళితులు ఉన్నారు.

ప్రొసిడింగ్ కాపీ అందజేత

భైంసారూరల్: బాసర వెల్మ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసిడింగ్ కాపీని సంఘ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందజేశారు. మండలంలోని దేగాం గ్రామంలోని సోమవారం విఠల్‌రెడ్డిని ఆయన నివాసంలో సంఘ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌రావు, సుధాకర్, గంగారాయుడు, సంజీవ్‌రావు, వినాయక్‌రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భీం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కుభీర్: మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన కుమురం భీం విగ్రహ ఏర్పాటుకు నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, బి.విఠల్, నాయకులు ముత్యం, సాయినాథ్, నాయకులు పి.బాబు తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా బ్యాగ్ ధర రూ.270 ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డులను తీసుకురావాలని సూచించారు.

నేడు ప్రజావేదిక

లోకేశ్వరం: స్థానిక రైతువేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ఈ తనిఖీ నిర్వహించారని తెలిపారు. ఏడాదిలో జరిగిన ఉపాధి పథకంలో రూ.6.10 కోట్లను వివిధ పనుల కోసం ఖర్చు చేశారని పేర్కొన్నారు. వీటికి సంబంధించి పనులపై ప్రజావేదిక ఉంటుందని వివరించారు.